క్లుప్తంగా

ఆలయానికి మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌నాయుడు

కేవీపల్లె : మండలంలోని మఠంపల్లె పంచాయతీ మొరవవడ్డిపల్లె సమీపంలో నిర్మించిన శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత యోగీశ్వర స్వామి ఆలయానికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్‌నాయుడు మైక్‌సెట్ వితరణ చేశారు. శనివారం ఆయన మొరవవడ్డిపల్లెకు చేరుకుని ఆలయ కమిటీ పెద్దలకు మైక్‌సెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన, వెంకటరాయుడు, అశోక్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని రైతుకు గాయాలు

మదనపల్లె : ట్రాక్టర్ ఢీకొని రైతు గాయపడిన సంఘటన శనివారం ములకలచెరువు మండలంలో జరిగింది. దేవళచెరువు పంచాయతీ పాయలవానిపెంట గ్రామానికి చెందిన రైతు మహదేవరెడ్డి(40) సొంత పనులపై ద్విచక్ర వాహనంలో వేపూరికోట నుంచి పెద్దపల్లెకు వస్తుండగా, ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయాడు. ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని అకస్మాత్తుగా పక్కకు తిప్పడంతో ట్రాలీ ఢీకొని రైతు మహదేవరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

108లో ప్రసవం



మగబిడ్డను కుటుంబ సభ్యులకు అందిస్తున్న ఈఎంటీ

నిమ్మనపల్లె : మండల పరిధిలోని వెంగంవారిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన బి.గురుమూర్తి భార్య బి.ప్రమీల 108లో శనివారం మధ్యాహ్నం ప్రసవించింది. రెండోకాన్పులో భాగంగా పురిటినొప్పులు రాగా నిమ్మనపల్లె 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ వాహనం గొల్లపల్లె నుంచి ప్రమీలను తీసుకువస్తుండగా, మార్గంమధ్యలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ శశికళ వైద్యసేవలు అందించారు. అనంతరం నిమ్మనపల్లె వైద్యశాలకు ప్రసవానంతర చికిత్స కోసం తరలించారు.

వస్త్రవ్యాపారి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె : వస్త్ర వ్యాపా రం చేస్తున్న దుకాణ యజమాని అదృశ్యం కావడంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. పట్టణంలోని సొసైటీ కాలనీకి చెందిన జయచంద్ర(40) దుస్తుల దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. మూడు రోజుల క్రితం పిల్లలను ట్యూషన్ వద్ద వదిలేందుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని భార్య శశికళ భర్త ఆచూకీ కోసం పలు చోట్ల వెతికింది. ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. జయచంద్ర ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాల్సిందిగా వారు కోరారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించారు. తంబళ్లపల్లెకు చెందిన రమణ భార్య జ్యోతి(28) శనివారం పక్కింటి వారితో గొడవ పడింది. దీంతో మనస్తాపం చెంది నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అదే విధంగా రామసముద్రంకు చెందిన పళ్ల వ్యాపారి మాబూసాబ్(52) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కమనీయం.. లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. మంగళవారం స్వాతి నక్షత్రం, ఇదే రోజు స్వామి వారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో వివాహ వేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. రంగురంగుల పుష్పాలతో స్వామి వార్లను అలంకరించారు. ముత్యాల తలంబ్రాలతో పెళ్లి వేడుక నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

విజయా డెయిరీ పాపం చంద్రబాబుదే

- లోకేష్ నోరు అదుపులో పెట్టుకో
- లోకేష్ విసిరిన సవాల్‌కు తంబళ్లపల్లిలోనే మేము చర్చకు సిద్ధం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : టీడీపీ పాలనలో విజయా డెయిరీని సర్వనాశనం చేసిన ఘనత చంద్రబాబుదేనని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి విమర్శించారు. యువగళం పాదయాత్రలో భాగంగా మదనపల్లిలో జరిగిన సభలో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ నారా లోకేష్ విసిరిన సవాల్‌పై ఎమ్మెల్యే శనివారం మండలంలోని రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్లపల్లిలోని కొండా సిద్ధార్థ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు తంబళ్లపల్లి నియోజకవర్గంలో ఏం అభివృద్ధి సాధించాడని ప్రశ్నించారు. తంబళ్లపల్లిని దత్తత తీసుకుని హార్టికల్చర్ హబ్ చేస్తానని హామీలిచ్చి శిలా ఫలకాలకే పరిమితం చేసి చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. కుప్పం అభివృద్ధిని గాలికొదిలేసిన వ్యక్తి తంబళ్లపల్లి రూపురేఖలు ఎలా మారుస్తాడని నిలదీశారు. లోకేష్ నోరు అదుపులో పెట్టుకో.. వార్డు మెంబర్ స్థాయి కూడా లేని నువ్వు పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తావా, నీకు దమ్ము, ధైర్యం ఉంటే నీ సవాల్‌ను మేం స్వీకరిస్తున్నాము, నువ్వు పాదయాత్ర చేస్తున్న నియోజకవర్గ కేంద్రమైన తంబళ్లపల్లిలోనే ఈ నెల 12న నేను, ఎంపీ మిథున్‌రెడ్డి ఉంటాము.. బహిరంగ చర్చకు నువ్వు సిద్ధమా అంటూ ప్రతి సవాల్ విసిరారు. మీ తాత ఎన్టీఆర్‌ను నిలువునా ముంచిందెవరో, ఎలా చనిపోయాడో, మీ చిన్నాన్న ఎక్కడున్నాడో ముందు మీ నాన్నను అడిగి తెలుసుకో అని హితబోధ చేశారు. హైదరాబాద్‌లో పుట్టి విదేశాల్లో ఉంటూ కాలయాపన చేసిన నీవు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను విమర్శిస్తావా అంటూ మండి పడ్డారు. మీ నాన్న పాలనలో తంబళ్లపల్లి అభివృద్ధి శూన్యం, వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి అయినా కళ్లారా చూడాలని మేం స్వాగతిస్తున్నాం అన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి జనాలను పాదయాత్రకు రప్పించుకుంటున్నారని పులిచెర్లలో జరిగిన యాత్రే ఇందుకు నిదర్శనమన్నారు. యాత్రలో రోజుకు రూ.50 లక్షల దాకా ఖర్చు చేస్తున్నారు, ఎక్కడ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారన్నారు. మీరు చేసిన పాపాల సొమ్మే కదా, ఎంత మందిని బెదిరిస్తే ఈ డబ్బు వస్తుందో ప్రజలందరికీ తెలుసన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డిశేఖర్ రెడ్డి, మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, బీవీ సుబ్బరాం, కొండా సిద్ధార్థ, పాగొండ ఖలీల్ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు సహించం

ములకలచెరువు : పెద్దిరెడ్డి కుటుంబంపై నారా లోకేష్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మండల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 30 ఏళ్లలో ఎప్పుడూ జరగనంత అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని చేశారన్నారు. జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచులు , ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తంబళ్లపల్లె : పెద్దిరెడ్డి కుటుంబీకులను విమర్శించే అర్హత లోకేష్‌కు లేదని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా రూ.కోట్ల ఖర్చుతో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఎంతో అభివృద్ధి కళ్లముందు కనబడుతున్నా ఏ అభివృద్ధి లేదనడం కళ్లు లేని కబోది అనేందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా లోకేష్ విమర్శలు మాని పాదయాత్ర చేసుకోవాలని లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నీలూఫర్, నాయకులు కోటిరెడ్డి, సురేంద్ర, శివారెడ్డి, సోషల్‌మీడియా ప్రతినిధులు సురేష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రామమూర్తి , పద్మనాభరెడ్డి, భాస్కర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై జీఎంకార్స్ వార్షికోత్సవం



హార్సిలీహిల్స్‌పై జీఎంకార్స్ సంస్థ వార్షికోత్సవంలో ఉద్యోగులు

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌పై శనివారం తిరుపతికి చెందిన జీఎంకార్స్ కెస్వీన్ ఆటో మోటార్స్ షోరూం ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, సిబ్బంది హాజరై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. షోరూం అధినేత ఉదయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ షోరూం ప్రారంభ ఏడాదిలో వినియోగదారులకు ఉత్తమ సేవలు అందిస్తూ 600 వాహనాలను విక్రయించినట్టు చెప్పారు. వచ్చే ఏడాదిలో మరిన్ని విస్తృత సేవలు అందిస్తామని తెలిపారు. తమ సంస్థ షోరూమ్‌లను కర్నూలు, కడప, అనంతపురంలలో ప్రారంభించనున్నట్టు తెలిపారు.

అవినీతి ఆరోపణలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

- దమ్ముంటే నారాలోకేష్ చర్చకు రావాలి
- పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎదిరించడం బాబువల్లే కాలేదు
- కబ్జాదారులను పక్కన పెట్టుకుని మాపై విమర్శలా?
- సవాల్ విసిరిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె : యువగళం పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ తనపై చేసిన అవినీతి ఆరోపణలు నిరూపిస్తే.. తాను రాజీనామాకు సిద్ధమని, దమ్ముంటే ఆయన చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా సవాల్ విసిరారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లె నియోజకవర్గంలోనే కాదు, యావత్ ప్రపంచంలో ఎమ్మెల్యే నవాజ్ బాషా ఒక సెంటుభూమి ఆక్రమణకు, అవినీతికి, కబ్జాకు పాల్పడినట్లు నిరూపిస్తే తాను రాజీనామాతోపాటుగా శాశ్వతంగా రాజకీయాల నుంచి వైదొలుగుతానని స్పష్టం చేశారు. మదనపల్లెలో నారా లోకేష్ తనపై పోటీ చేసి గెలిస్తే శాశ్వతంగా ఆయనకు బానిసగా ఉంటానని, లేకపోతే నాకు బానిసగా ఉంటావా అని ప్రశ్నించారు. బీటీ కళాశాల ట్రస్ట్‌కు సంబంధించినదని, దాన్ని ఎవరూ కబ్జా చేయలేరన్న విషయం తెలియకపోవడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. కబ్జాకోరులను, అవినీతిపరులను చుట్టూ పెట్టుకుని నీతి, నిజాయితీతో బతుకుతున్న తనపై ఎవరో రాసిన స్క్రిప్టును చదివి వెళ్లడం కాదని, ఆధారాలుంటే నిరూపించాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేలందరికీ నీతి, నిబద్ధత, విలువలతో ప్రజాసేవ చేయాలని ఆదేశించారని, తామంతా అదే మార్గంలో నడుస్తున్నామన్నారు. కరోనా సమయంలో సొంతనిధులతో తాను పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తే దుకాణదారుల నుంచి డబ్బులు వసూలు చేశాననడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మదనపల్లెలో లోకేష్ తనపై చేసిన అవినీతి ఆరోపణలపై ఎక్కడైనా తాను ప్రమాణానికి సిద్ధమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మదనపల్లె ప్రశాంతంగా ఉందనే విషయం అందరికీ తెలుస న్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిపై చేసిన ఆరోపణలపై ఆయన స్పందించారని, లోకేష్ ఆదివారం తంబళ్లపల్లెలో జరిగే చర్చా కార్యక్రమానికి హాజరై మగతనాన్ని నిరూపించుకోవాలన్నారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, సర్పంచ్ శరత్‌రెడ్డి, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ పోతబోలు నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, బాబ్‌జాన్, ఇస్మాయిల్, మునిశేఖర్, కౌన్సిలర్ వసీం, వైస్ ఎంపీపీ నందినితాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనుమలో గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరు రోడ్డులోని శ్రీ కనుమలో గంగమ్మ జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. రాత్రి తిరునాల పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల కోసం క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. బసినికొండ, రామాచార్లపల్లె, నిమ్మనపల్లె రోడ్డు, డ్రైవర్స్ కాలనీ, మొలకలదిన్నె, వలసపల్లె గ్రామాలకు చెందిన మహిళలు దీలు,బోనాలు సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు.

నేడు ముదివేడు తిరునాల



ముదివేడు దండుమారెమ్మ ఆలయం

కురబలకోట : మండలంలోని ముదివేడు దండుమారెమ్మ తిరునాల ఆదివారం రాత్రి వైభవంగా జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. చాందినీ బండ్ల మెరవణి ఘనంగా నిర్వహిస్తామన్నారు. సోమవారం పగలు తిరునాల సాగుతుందని తెలిపారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కేశప్ప వెల్లడించారు. ఎప్పటిలా రికార్డింగ్ డ్యాన్సులను నిషేధించినట్లు ముదివేడు ఎస్ఐ సుకుమార్ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తిరునాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

లెప్రసీ సర్వేను విజయవంతం చేయండి



లెప్రసీ సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అధికారులు

మదనపల్లె : లెప్రసీ సర్వేను విజయవంతం చేయాలని జిల్లా కంటివెలుగు ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ రివాజ్, జిల్లా లెప్రసీ న్యూక్లియక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం వారు పట్టణంలోని దొంతివీధి, త్యాగరాజవీధి ఆరోగ్యకేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటివెలుగు ప్రగతిని పరిశీలించారు. జిల్లా ఆస్పత్రి కంటివిభాగాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న లెప్రసీ సర్వే ప్రత్యేక చొరవతో చేయాలన్నారు. అనుమానితులను గుర్తించి వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సల్మాన్, బీపీఎంఓ వేణుగోపాల్, శ్రీనివాసులు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రెడ్డెప్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

25 అడుగుల గాంధీ ప్రతిమ ఏర్పాటు అభినందనీయం



గాంధీ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

పీలేరు : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ గోడకు 25 అడుగుల మహాత్మాగాంధీ ప్రతిమ ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి అన్నారు. సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా ప్రత్యేక చొరవతో పంచాయతీ భవనం గోడకు గాంధీ ప్రతిమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్ తన దేశభక్తిని చాటుకుంటూ ఇది వరకే పంచాయతీ కార్యాలయంపై 50 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేశారన్నారు. మరో అడుగు ముందుకేసి జాతిపిత మహాత్మాగాంధీ ప్రతిమను ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు హుమయూన్, బలసా వేణుగోపాల్, కూనా సత్యనారాయణ శెట్టి, అరవింద్‌బాబు, రవి, ఎన్.వి. చలపతి, పెద్దోడు, మహితాఆనంద్, మస్తాన్, మసూద్, గడిబాషా, ఉదయ్‌కుమార్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణోత్సవ దృశ్యం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయంలో శనివారం జరిగిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు.ఫాల్గుణ మాసం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జన్మ నక్షత్రం, స్వాతి నక్షత్రం సందర్భంగా కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకా ఎగువకోట నుంచి ఉత్సవ విగ్రహాలు తెచ్చి శివాలయంలో నరసింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీదేవి

వాల్మీకిపురం : రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్నాయని, విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు అంకితం కాకుండా ఇంటి దగ్గర తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించాలన్నారు. అలాగే మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయించడం, ధ్యానం, యోగా వంటి చేయడం వలన ఒత్తిడికి గురి కాకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాజున్, లక్ష్మికాంత, పుష్పలత, అనురాధ, శోభారాణి, నాగరత్న, పర్హత్ తారాబేగం, సుధారాణి, జ్యోత్స్నరాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

26న టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం

మదనపల్లె సిటీ: మదనపల్లె కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం 26న నిర్వహిస్తున్నట్లు బ్యాంకు సీఈఓ ప్రసాద్ తెలిపారు. సీటీఎం రోడ్డులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

వసంతోత్సవం.. అంగరంగ వైభవం



చెంబకూరులో గట్టు వెంకటరమణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రామసముద్రం : రామసముద్రం మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. స్వామివారిని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్వామివారి ముందు పిల్లలు , పెద్దలు వసంతలు చల్లుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ధ్వజ అవరోహణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

మదనపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎంసీసీ టీంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిబంధనల ప్రకారమే ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఉల్లంఘనలు ఏవైనా ఉంటే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లలో ఎన్నికల అధికారులు, ఓటర్లకు తప్ప ఇతరులకు ప్రవేశం లేదన్నారు. ఆదివారం ఉదయం మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు జెడ్పీహైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులందరూ ఉదయం 8గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకుని సామగ్రిని తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎంసీసీ అధికారులు పర్యవేక్షణ జరపాలన్నారు. సమావేశంలో డీఎల్‌డీఓ లక్ష్మీపతి, డీఏఓ శేషయ్య, కమిషనర్ ప్రమీల, డివిజన్‌లోని 15మంది తహసీల్దార్‌లు, 11మంది ఎంపీడీఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

కేవీపల్లె : పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని నూతనకాల్వ పంచాయతీ సీకేఆర్‌పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య అన్నారు. శనివారం సీకేఆర్‌పల్లె పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలంటే ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. పాఠశాల నుంచి ఇంటి కొచ్చిన అనంతరం టీవీలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. తమ పిల్లలకోసం సమయం కేటాయించి చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం మనందరి బాధ్యత

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిలను గెలిపించడం మనందరి బాధ్యత అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక శ్రీనివాసులురెడ్డి భవనంలో మండలశాఖ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా యువతకు ప్రాధాన్యత ఇచ్చి విద్యావంతులకు అవకాశం కల్పించారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, కలికిరి మార్కెట్‌కమిటీ చెర్మన్ రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, మండల జేఎంసీ కన్వీనర్ మోహన్ రాజ్, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించండి

కలికిరి : వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మండలంలో శనివారం విస్తృత ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, నాయకులు బావాజీ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. శనివారం గుర్రంకొండలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతుడైన పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ సద్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటశివారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ చింతిర్ల నాగేంద్ర, మాజీ ఎంపీపీ జమీర్‌ఆలీఅలీఖాన్, మండల ప్రత్యేక ఆహ్వానితులు గుణశేఖర్, అప్పల్ల, ఎలీవ్రమణ, వైస్‌ఎంపీపీ కరుణాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, హౌస్‌ఫెడ్ చైర్మన్ నక్కాగోపి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె : ఈ నెల 13న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. శనివారం మండలంలోని పగళ్లలో కరపత్రాలు అందజేసి ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జయరామచంద్రయ్య, రామకొండారెడ్డి, రఘునాథరెడ్డి, ఖాదర్‌బాషా, హర్షవర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.